తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
ఆదివారం
09 ఆగష్టు 2026
పేజీలు : 8



## రైతులకు 18 గంటలు నాణ్యమైన కరెంటు ఇవ్వాలి


### మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



హాలియా, ఆగస్టు 8 (జనంసాక్షి): వ్యవసాయానికి రోజుకు 18 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ డిమాండ్ చేశారు. శనివారం హాలియాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని విమర్శించారు. గోదావరి జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ కాళేశ్వరం పంపులను వినియోగించడం లేదని ఆరోపించారు. రైతుల ఆందోళనతో స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వ్యవసాయానికి 18 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో సుమారు 400 మంది రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో అగ్నిప్రమాదం





**యాదగిరిగుట్ట ఆగస్టు 8 ( జనంసాక్షి )**
యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట సమీపంలో శనివారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గుండ్లపల్లి నర్సింహకు చెందిన దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దుకాణం నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా అడ్డుకోగలిగారు. ప్రమాద సమయంలో దుకాణంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పినట్లు స్థానికులు తెలిపారు.
ఈ ప్రమాదంలో దుకాణంలో ఉన్న వివిధ రకాల సామగ్రి మంటల్లో కాలిపోయిందని యజమాని గుండ్లపల్లి నర్సింహ తెలిపారు. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు ఆయన పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు, అగ్నిమాపక సిబ్బంది నష్టం వివరాలను అంచనా వేశారు. ప్రమాదంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను పెంచాలి":కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 8 (జనం సాక్షి):** వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలో పంటల సాగు ప్రణాళికను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటల విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, ఎక్కడా నీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన నిర్వహించిన నీటి పారుదల సలహా సంసిద్ధత సమావేశంలో జిల్లాలో నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అధికారులతో సమీక్షించారు.తాగునీటికి తొలి ప్రాధాన్యతఅందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని, రాబోయే రోజుల్లో నీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. తాగునీటి అవసరాలకు భంగం

మిగతా 9లో

## వామ్మో.. అధ్వానంగా తుంగతుర్తి వెలుగుపల్లి రోడ్డు

### ఒకవైపు గుంతలు మరోవైపురోడ్డు పారుతున్న మురికి నీరు



**తుంగతుర్తి ఆగస్టు 8 (జనంసాక్షి)**
అట్టహాసంగా శిలాఫలకం వేసి కొబ్బరికాయలు కొట్టిపనులు ప్రారంభిస్తామని చెప్పి రెండు సంవత్సరాలు పూర్తి అయిన పనులు ప్రారంభం కాకపోవడంతో తుంగతుర్తి వెలుగుపల్లి రోడ్డు గుంతలతో ఒక వైపు మరో వైపు రోడ్ పై మురికినీరు పారుతుండటం చిన్న వర్షానికే చిత్తడి గా మారటం తో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు, నియోజకవర్గ కేంద్రం నుంచి వెలుగుపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటం నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై అడుగడుగునా గుంతలు, బురద, నీటి నిల్వలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రహదారి మొత్తం చిత్తడిగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం జాజిరెడ్డిగూడెం నుండి మానాపురం వరకు డబల్ రోడ్డు గా మార్చడం కోసం 20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది దీంతో ప్రస్తుతం ఎమ్మెల్యే తో పాటు అప్పటి జిల్లా పరిషత్ చైర్మన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. దీంతో రహదారి రూపురేఖలు మారుతాయని, ప్రయాణ కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశించారు. అయితే శంకుస్థాపన అనంతరం పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంతో ప్రజల ఆశలు నిరాశగా మారాయి.

మిగతా 3లో

## ఇళ్ల మధ్య గేదెల పెంపకం వద్దు.. మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

### గేదెల యజమానులు జాగ్రత్త.. నివాస ప్రాంతాల్లో పెంపకం నిషేధం



**చందంపేట, ఆగష్టు 08 (జనంసాక్షి)**
నివాస ప్రాంతాల్లో గేదెల పెంపకం విరుద్ధమని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ రామ దుర్గా రెడ్డి తెలిపారు. శనివారం ప్రజా ఆరోగ్యం ఒ పారిశుధ్య విభాగం లో భాగంగా ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపాలిటీ పరిధిలో కొంతమంది గేదెల యజమానులు ఇళ్ల మధ్య, నివాస ప్రాంతాల్లో గేదెలను పెంచడం వలన పేడ, మూత్రం, దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు పెరిగి ప్రజలకు అసౌకర్యం మరియు ప్రజారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు.కావున మున్సిపాలిటీ పరిధిలోని గేదెల యజమానులు తప్పనిసరిగా క్రింది సూచనలు పాటించాలని అన్నారు.

1. ఇళ్ల మధ్య మరియు నివాస ప్రాంతాల్లో గేదెలను ఉంచరాదు.
2. గేదెల పేడ, వ్యర్థాలను రోడ్లపై, డ్రైనేజీల్లో వేయరాదు.
3. గేదెల కొట్టాలను పరిశుభ్రంగా ఉంచాలి.
4. పేడ, మూత్రం వల్ల దుర్వాసన మరియు దోమలు, ఈగలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి.
5. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్లపై గేదెలను వదలరాదు.
6. మున్సిపల్ సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

పై సూచనలు పాటించని యజమానులపై మున్సిపల్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడతాయి. ప్రజారోగ్యం మరియు పట్టణ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మున్సిపాలిటీకి సహకరించాలని తెలిపారు.నివాస ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యానికి, పారిశుద్ధ్యానికి ఇబ్బందులు కలిగించే విధంగా పశువులను పెంచకుండా మున్సిపల్ నిబంధనలను పాటించాలని కమిషనర్ కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

# వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను పెంచాలి":కలెక్టర్ అంకిత్

కలగకుండా సాగునీటి వినియోగంలో శాఖల మధ్య సమన్వయం పాటించాలని తెలిపారు.జిల్లాలో 2,384 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉండగా.. 598 చెరువుల్లో 0?25 శాతం, 965 చెరువుల్లో 25?50 శాతం, 587 చెరువుల్లో 50?75 శాతం, 207 చెరువుల్లో 75?100 శాతం నీటి నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో 27 చెరువులు పూర్తిస్థాయిలో నిండి మిగులు నీటితో ఉన్నట్లు వివరించారు.ప్రాజెక్టుల్లో నీటి నిల్వలుతాలిపేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా ప్రస్తుతం 73.68 మీటర్ల వద్ద 669 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు ఆయకట్టు 24,700 ఎకరాలు. పెద్దవాగు ప్రాజెక్టులో 81.235 మీటర్ల పూర్తిస్థాయి నీటిమట్టానికి గాను ప్రస్తుతం 75.235 మీటర్ల వద్ద 90.427 ఎంసీఎఫ్టీ నీరు ఉంది. దీని ఆయకట్టు 2,360 ఎకరాలు.కిన్నెరసాని ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 124.08 మీటర్లు కాగా ప్రస్తుతం 122.46 మీటర్ల వద్ద 6,950 ఎంసీఎఫ్టీ నీటి నిల్వ ఉంది. దీని ఆయకట్టు 10 వేల ఎకరాలు.18.8 శాతం వర్షపాతం లోటుజిల్లాలో ఇప్పటివరకు 455.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 561.4 మి.మీ.తో పోలిస్తే 18.8 శాతం లోటు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూన్‌లో 4.3 శాతం, జూలైలో 31.8 శాతం లోటు నమోదవగా, ఆగస్టులో ఇప్పటివరకు సాధారణం కంటే 1.2 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు వివరించారు.సీజనల్ యాక్షన్ ప్లాన్‌లో 4,86,048 ఎకరాల సాగు లక్ష్యానికి గాను ఇప్పటివరకు 4,21,367 ఎకరాల్లో సాగు పూర్తై 86.69 శాతం సాధన నమోదైంది. పత్తి లక్ష్యం 2,19,000 ఎకరాలు కాగా పూర్తి స్థాయిలో సాగైంది. వరి లక్ష్యం 31,500 ఎకరాలు కాగా 70,652 ఎకరాల్లో సాగు నమోదైంది. మొక్కజొన్న 75,775 ఎకరాలు, పెసర 6,620 ఎకరాలు, కంది 2,916.23 ఎకరాలు, మినుము 324 ఎకరాల్లో సాగైనట్లు అధికారులు తెలిపారు.ప్రత్యామ్నాయ పంటలపై అవగాహనవర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పెసర, మినుము, కంది, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి తక్కువ నీటి వినియోగ పంటలను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రత్యామ్నాయ పంటల సాగు ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు.చెరువులు, బోర్‌వెల్స్‌పై అధికంగా ఆధారపడి వరి సాగు చేయడాన్ని నిరుత్సాహపరచాలని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలని తెలిపారు. రైజ్డ్ బెడ్ విధానం, నీటి సంరక్షణ, వాటర్ హార్వెస్టింగ్, నేలలో తేమను కాపాడే పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.జిల్లాలో 1,38,198 ఎకరాలను ప్రత్యామ్నాయ పంటల పరిధిలోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. అన్ని క్లస్టర్లలో పెసర, మినుము, కంది వంటి పంటలను ప్రోత్సహిస్తూ సబ్సిడీ విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు వివరించారు. పత్తి, మొక్కజొన్న, వరి సాగు ప్రాంతాల్లో పంటల వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్‌పామ్ సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.నిరంతర పర్యవేక్షణచెరువులు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, వర్షపాతం, తాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, ప్రత్యామ్నాయ పంటల విస్తీర్ణాన్ని పెంచి పంట నష్టాల ప్రమాదాన్ని తగ్గించాలని సూచించారు. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యత, సాగునీటి వినియోగంలో సమర్థత, పంటల వైవిధ్యీకరణ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఇరిగేషన్ ఎస్సీ శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, సీపీఓ సునీత, మిషన్ భగీరథ ఈఈలు నలిని, తిరుమలేష్, నీటిపారుదల శాఖ ఈఈలు, డీఈలు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



**బీర్ల అనిత జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు**

**మోటకొండూరు ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్ ప్యాకెట్ల పంపిణీ**

**మోటకొండూరు, ఆగస్టు 08(జనం సాక్షి):-**
ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సతీమణి, బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మోటకొండూరులో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మోటకొండూరు మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బీర్ల అనిత జన్మదినం సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన అనారోగ్య బాధితులకు, అలాగే వారి వెంట ఉన్న సహాయకులకు కాంగ్రెస్ నాయకులు బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాయకుల జన్మదిన వేడుకలను కేవలం ఆడంబరాలకు పరిమితం చేయకుండా, ప్రజలకు ఉపయోగపడేలా ఇలా సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం అందరికీ ఆదర్శనీయమన్నారు.ఈ సేవా కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ బుగ్గ కొమురయ్య, జిల్లా నాయకులు భూమండ్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు జూకంటి మధు, ఆలేరు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బుగ్గ మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆలేటి ఉమేష్ చురుగ్గా పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు కొల్లూరి బిక్షపతి, రేగు అశోక్, బాల్ద మధు, వస్పరీ శ్రీకాంత్, బోట్ల నాగులు, రాపోలు శ్రీకాంత్, రేగు మణికంత, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఇప్ప మహేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలి

**కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిక్లరేషన్ హామీలను నిలబెట్టుకోవాలి**

**ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమకారులకు పెన్షన్ మంజూరు చేయాలి**

**ఈ నెల 11న ఆలేరులో జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సును జయప్రదం చేయండి**

**కరపత్రాల ఆవిష్కరణలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ళ రమేష్ మాదిగ**

మోటకొండూరు, ఆగస్టు 08(జనం సాక్షి):-
దళిత గిరిజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నాడు చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయహస్తం' పథకాన్ని వెంటనే ప్రకటించి, అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కూరెళ్ళ రమేష్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 11న ఆలేరులోని వైఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మోటకొండూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి వంగపల్లి చిరంజీవి మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రమేష్ మాదిగ ముఖ్య అతిథిగా, జిల్లా కన్వీనర్ బొట్ల శ్రీనివాస్ మాదిగ గౌరవ అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా కూరెళ్ళ రమేష్ మాదిగ మాట్లాడుతూ.. 30 ఏళ్ల నిరంతర పోరాట ఫలితంగా ఏబీసీడీ వర్గీకరణ సాధ్యమైందని, వర్గీకరణ చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అయితే, గత ప్రభుత్వాల మోసాలను తిప్పికొట్టి, మార్పు కోసం కాంగ్రెస్ వైపు నిలిచిన మాదిగలకు ప్రస్తుత ప్రభుత్వం కూడా నిరాశే మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ న్యాయమైన డిమాండ్ల సాధనపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకే ఈ నెల 11న ఆలేరులో సదస్సు నిర్వహిస్తున్నట్లు, దళితులు, మాదిగ బిడ్డలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పల్లె మైసయ్య, ఆడపు బిక్షపతి, మాదిగ యువసేన జిల్లా నాయకులు ముదుగుల శ్రీకాంత్, యువసేన మండల నాయకులు కొల్లూరు మధు, జంపాల ఆత్మరావ్, వంగపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటమే బీజేపీ లక్ష్యం..

**కాంగ్రెస్ పాలనలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు..**

**మునుగోడు ఎమ్మెల్యే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలి. డా. గంగిడి మనోహర్‌రెడ్డి**

**చండూరు, ఆగస్టు 8 (జనంసాక్షి)**
ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. చండూరు మున్సిపల్ కేంద్రంలోని భవాని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ చండూరు మండల, మున్సిపల్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిన్నదని, ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని అన్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం బాధాకరమని, గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు చెబుతున్న సమస్యలను కూడా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్లు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, యువతకు ఉపాధి వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉచిత బియ్యం, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన తదితర పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ అధికారంలో ఉంటే 'డబుల్ ఇంజన్' ప్రభుత్వంతో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని తెలిపారు.మునుగోడు నియోజకవర్గంలో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని, లేకపోతే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తున్నప్పటికీ బీజేపీకి చెందిన సర్పంచులు, కౌన్సిలర్లకు నిధులు మంజూరు చేయకపోవడం





శోచనీయమన్నారు.అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త ప్రజా క్షేత్రంలో చురుగ్గా పనిచేసి పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని, కాంగ్రెస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.చండూరు మండలంలోని విద్యా సమస్యలు, ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి, తాగు, సాగునీటి సమస్యలు, పారిశుధ్యం, గ్రామీణ రహదారులు, కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్యలపై సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు.చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కళాకారులను ఘనంగా సన్మానించారు. చేనేత కార్మికులకు బీజేపీ అండగా ఉంటుందని నాయకులు భరోసా ఇచ్చారు.మండల, మున్సిపల్ పార్టీల అధ్యక్షులు ముదిగొండ ఆంజనేయులు, భూతరాజు శ్రీహరి ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు దోనూరి వీరారెడ్డి, కర్నాటి ధనుంజయ, కోమటి వీరేశం, బొమ్మరబోయిన రాజుముదిరాజు, మండల ప్రభారి జక్కల రాజు, జిల్లా పార్టీ కార్యదర్శి వరికుప్పల గిరి, యువమోర్చ రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్, బిజెపి జిల్లా నాయకులు మిర్యాల వెంకటేశం, తిరందాసు కనకయ్య, నకిరెకంటి లింగస్వామి, అన్నెపర్తి యాదగిరి, మాదగోని వెంకన్న, సీనియర్ నాయకులు బొబ్బల మురళీ మనోహర్ రెడ్డి, మేకల సుదర్శన్ రెడ్డి, చిలుకూరి అశోక్, రావిరాల శ్రీను, సోమ నరసింహ, పేర్ల గణేష్, బొబ్బల శివ, దోటి కిరణ్, పార్టీ ప్రధాన కార్యదర్శులు పద్నబోయిన శ్రీను, ఆవుల అశోక్, సోమ శంకర్, భూతరాజు స్వామి, దోటి శివకుమార్, సుగుణాచారి, ఉపసర్పంచ్ లు పల్లపు స్వామి, పెండెం ఉపేందర్, కర్నాటి శంకర్, చేనేత డైరెక్టర్లు తిరందాసు సుధాశ్రీను, చెరిపల్లి కృష్ణ, కోమటి ఓంకారం, తిరందాసు నరసింహ, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వామ్మో.. అధ్వానంగా తుంగతుర్తి వెలుగుపల్లి రోడ్డు ఒకవైపు గుంతలు మరోవైపురోడ్డు పారుతున్న మురికి నీరు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే పనులు నిలిచిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రహదారి పనులు పూర్తికాకపోవడంతో వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని చెబుతున్నారు. మరోవైపు రోడ్డు కు ఇరువైపుల డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇండ్ల నుండి మురికి నీరు ఈ రోడ్డుపై పారుతుండడంతో బురద మయంగా మారడంతో వాహనాలు సైతం బురదలో దిగబడి పోతున్నాయి, దీంతో వాహనదారులకు ఇప్పుడు ఏమి జరుగుతుందో అనే భయం వెంటాడుతుంది,రాత్రి వేళల్లో గుంతల్లో వర్షపు నీరు నిలిచి ఉండటంతో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు బురదలో జారిపడే ప్రమాదం ఉండగా, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ మార్గం గుండా ప్రయాణిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే అంబులెన్స్‌లు, ఇతర వాహనాలకు సైతం ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుని, నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటివరకు కనీసం గుంతలను పూడ్చి, బురద సమస్యను తొలగించేలా తాత్కాలిక చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## రామాపురంలో స్నైపర్ డాగ్‌తో గంజాయి తనిఖీలు

మేళ్లచెరువు జనం సాక్షి

మేళ్లచెరువు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి నియంత్రణలో భాగంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది స్నైపర్ డాగ్ సహాయంతో గ్రామంలోని టీ పాయింట్లు, పాన్ డబ్బాలు, పాఠశాల పరిసర ప్రాంతాల్లో గంజాయి కోసం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## ఘనంగా తెలంగాణ రాబిన్‌హుడ్ పండగల సాయన్న జయంతి వేడుకలు..

చండూరు, ఆగస్టు 8 (జనంసాక్షి)

నల్గొండ జిల్లా చండూరు మండలం కస్తాల రోడ్ చౌరస్తాలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండగల సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను మాజీ ఎంపీపీ తోకల వెంకన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం తోకల వెంకన్న మాట్లాడుతూ.. నిజాం ప్రభుత్వం, దొరలకు వ్యతిరేకంగా పండగల సాయన్న తిరుగుబాటు చేశారని తెలిపారు. సాయన్నను అణచివేయడానికి భూస్వాములు కుట్ర పన్ని నిజాం సైన్యంతో అంతమొందించారని పేర్కొన్నారు. దొరలు, రజాకారుల నుంచి సంపదను కొల్లగొట్టి నిరుపేదలకు పంచిపెట్టినందుకే ప్రజలు ఆయనను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలిచారని అన్నారు. సాయన్న వీరోచిత గాథలను నేటికీ జానపద కళాకారులు కథల రూపంలో ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కారింగు యాదయ్య, ప్రధాన కార్యదర్శి గండూరి నగేష్, పడమటి తాళ్ల సర్పంచ్ గాలెంక రాంబాబు, పిట్టల రాంబాబు, దొంతరగోని వెంకన్న, దొంతరగోని హరీష్, మహేష్, అనిల్, రాము, పందు, సైదులు, నక్కపోతు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మీడియా విభాగం చైర్మన్‌గా చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు

### పుష్పగుచ్ఛం అందజేసి అభినందించిన మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ నాయకులు

భువనగిరి, ఆగస్టు 8 (జనం సాక్షి)

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరేకార్ శ్రీను, ఎం.డి. కరీం మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నూతన బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో మీడియా పబ్లిసిటీ విభాగం కీలక పాత్ర పోషించాలని నాయకులు పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా మీడియా విభాగం సమన్వయంతో పనిచేయాలని



వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు

### ం సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన ఆదివాసీ దినోత్సవ వేడుకలు
### ం తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో ఆదివాసి దినోత్సవ వేడుకలు

పి.ఏ.పల్లి,ఆగష్టు 08(జనం సాక్షి )

ఆదివాసీ సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలంగాణ గిరిజన మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ , గిరిజన సంక్షేమ సెక్రెటరీ కే సీత లక్ష్మి, డి ఎస్ వేణుగోపాల్ , ఓ ఎస్ డి లు జి బి వెంకటేశం, రామారావు, సతీష్ గౌడ్, నీరజాసిన్హా, నల్గొండ రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావ్, మైనంపల్లి సర్పంచ్ రామ్ సింగ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమావత్ రవి , రాష్ట్రవ్యాప్త గిరిజన కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నృత్య ,గిరిజన పాత్ర కళా పోషణ షోకేస్,11 రకాల గిరిజన పండుగల దేవాలయాలు మరియు గిరిజనులకు సంబంధించిన నాలుగు రకాల స్టాల్స్ అవి గదా,కళా,స్వాద్,ఔషధ ప్రదర్శించారు. ప్రదర్శనలో ప్రతి ఒక్క విద్యార్థి గిరిజనులకు సంబంధించిన హిస్టరీ, సాంస్కృతి సంప్రదాయాలు,ఆహార అలవాట్లు మరియు ఔషధ మొక్కలు సేకరించి వాటిని క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వెన్నుముక గా ఉన్నటువంటి తిరుమల రావు తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్, ఏ పి ఓ భాస్కర్ రావు అదిలాబాద్ సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమం ఆహ్లాద కరముగాను, కనులవిందు గాను ప్రదర్శించడం జరిగిందని మహిళ గిరిజన డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ, అధ్యాపక బృందం మరియు విద్యార్థినీలు ఆనందాన్ని వ్యక్తం చేశారు.






## బాధిత వికలాంగుడికి పోలీసుల భరోసా

### -దాతల సహకారంతో ట్రై సైకిల్ అందజేసిన ఎస్ఐ నరేష్

హుజూర్ నగర్, ఆగస్టు 8 (జనం సాక్షి) :

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ హుజూర్‌నగర్ పోలీసులు మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం హుజూర్ నగర్ పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన ఇందిరాల పిచ్చయ్యకు దాతల సహకారంతో నూతన ట్రై సైకిల్‌ను సమకూర్చి హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా అందజేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పిచ్చయ్య గత నెలలో తన ఇంటి బయట ట్రై సైకిల్‌ను పార్కింగ్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తి వాహనంతో ఢీకొట్టడంతో అది తీవ్రంగా దెబ్బతిని వినియోగానికి పనికిరాకుండా పోయింది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పిచ్చయ్య పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న పోలీసులు స్పందించి, అతని దైనందిన అవసరాలకు ట్రై సైకిల్ ఎంతగానో అవసరమని గుర్తించి అందజేశారు. ఆపదలో ఉన్న ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. దాతల సహకారంతో వికలాంగుడికి ట్రై సైకిల్ అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ టూ టౌన్ ఎస్ఐ హనుమాన్ నాయక్, ఏఎస్ఐ బలరాం రెడ్డి, పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కులు.. అందరి బాధ్యత

## ప్రకృతి పరిరక్షణలో ఆదివాసీలదే కీలక పాత్ర

### నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కుంజా వెంకట్ పిలుపు

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 8 (జనంసాక్షి)**



ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నపురెడ్డిపల్లి మండల ఆదివాసీ మండల అధ్యక్షుడు కుంజా వెంకట్ అన్నారు. నేడు నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుంజా వెంకట్ మాట్లాడుతూ.. ఆదివాసీ జాతుల పట్ల సమాజంలో అవగాహన కల్పించడం, వారి హక్కులను పరిరక్షించడం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. తరతరాలుగా అడవులు, కొండ ప్రాంతాల్లో ప్రకృతితో మమేకమై జీవిస్తున్న ఆదివాసీలు దేశ సంపదగా పేర్కొన్నారు.

**ప్రకృతి పరిరక్షణలో కీలక పాత్ర**

అడవులు, వనరుల పరిరక్షణలో ఆదివాసీలు కీలక పాత్ర పోషిస్తున్నారని కుంజా వెంకట్ అన్నారు. ప్రకృతిని తమ జీవన విధానంలో భాగంగా భావిస్తూ అటవీ సంపదను కాపాడుతున్నారని తెలిపారు. వేట, వ్యవసాయం తదితర సంప్రదాయ జీవన విధానాలతో జీవిస్తున్న ఆదివాసీలపై ప్రపంచీకరణ ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలకు విఘాతం కలగకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఆదివాసీల హక్కులను కాపాడుతూ విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక సదుపాయాల పరంగా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆదివాసీలు వున్నారు. ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 90 దేశాల్లో సుమారు 47.6 కోట్ల మంది ఆదివాసీలు నివసిస్తున్నారని తెలిపారు. ప్రపంచ జనాభాలో వారి వాటా 6 శాతం కంటే తక్కువగా ఉన్నప్పటికీ, 5,000కు పైగా విభిన్న ఆదివాసీ సమూహాలు ఉన్నాయని వివరించారు. భారతదేశంలో 705 గిరిజన తెగలు ఉండగా, దేశ జనాభాలో వారి వాటా సుమారు 9 శాతంగా ఉందన్నారు.

**ఆగస్టు 9కు చారిత్రక ప్రాధాన్యం**

ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి 1982 ఆగస్టు 9న జెనీవాలో తొలిసారిగా సమావేశం నిర్వహించిందని కుంజా వెంకట్ తెలిపారు. అనంతరం 1994 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం మేరకు ప్రతి ఏటా ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, వారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వాలు, ప్రజలు కలిసి కృషి చేయాలని కుంజా వెంకట్ పిలుపునిచ్చారు.



## కిషోర్ కుటుంబానికి అండగా సిటీ కేబుల్ రూరల్ ఆపరేటర్లు

**మధిర, ఆగస్టు 08 (జనంసాక్షి):**

మధిర సిటీ కేబుల్ సీనియర్ టెక్నీషియన్ టాకూరి కిషోర్ ఈరోజు మోటమర్రిలో దశదినకర్మ కార్యక్రమం సందర్భంగా సిటీ కేబుల్ రూరల్ ఆపరేటర్లు మానవతా దృక్పథంతో ఆయన కుటుంబానికి అండగా నిలిచారు. కిషోర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో రూ.29,300 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా కిషోర్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న రూరల్ ఆపరేటర్లు ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కిషోర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.



## ఇంకుడు గుంతలు స్కీమును మున్సిపాలిటీల్లో అమలు చేయాలి

**హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి**

**సమావేశంలో మాట్లాడుతున్న ఆలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి**

**హాలియా ఆగస్టు 08 (జనంసాక్షి)**

ఇంకుడు గుంతల స్కీమును మున్సిపాలిటీలో అమలు చేయాలని ఆలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో కలెక్టరేట్లో జరిగిన జనసరి కార్యక్రమం భూగర్భ జలాల పెంపుపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ. హాలియా మున్సిపాలిటీలో మంచినీటి సమస్య ఉందని. అందువలన రంగారెడ్డిగూడెం వాటర్ ప్లాంట్ నుంచి ఎక్కువ మంచినీరు వచ్చినట్లయితే. హాలియా ప్రజలు మంచినీటి ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని. అలాగే ఆలియా మున్సిపాలిటీలో ఇంకుడు గుంతలు జలసిరి ప్రోగ్రాం లో మున్సిపాలిటీలో అమలు చేయాలని పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందిస్తూ అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## పార్థదిహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

**హాలియా జనం సాక్షి ఆగస్టు 8**

ఆలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుముల పదకొండవ వార్డుకు చెందిన గుండెబోయిన పెద్ద పెద్దులు యాదవ్. అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకొని వారి పార్థ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హాలియా పట్టణ అధ్యక్షుడు వద్దే సతీష్ రెడ్డి పిల్లి వెంకట్ మురళి జూపల్లి కృష్ణ పే రుమల రాంబాబు. గుడిపల్లి నాగరాజు సీతారాల మహేష్ కేశ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీల అరణ్యరోదన పట్టదా?

- ○ అస్తిత్వం కోసం నేటికీ పోరాటమే.. పోలవరంతో ఆగమాగం.
- ○ అరకొర నిధులతో భద్రాచలం ఐటీడీఏ..
- ○ వెంటాడుతున్న విద్య, వైద్యం, ఉపాధి సమస్యలు

**భద్రాచలం ఆగస్టు 08 (జనంసాక్షి)**

అడవినే తల్లిగా భావించి తరతరాలుగా ప్రకృతితో మమేకమై జీవిస్తున్న ఆదివాసీలకు నేటికీ అస్తిత్వ పోరాటం తప్పడం లేదు. జల్?జంగల్? జమీన్‌పై హక్కులు క్రమంగా దూరమవుతుండటంతో తమ భవిష్యత్తుపై గిరిజనుల్లో ఆందోళన నెలకొంది. పోడు భూముల హక్కులు, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి సమస్యలు వారిని వెంటాడుతున్నాయి.

**- పోడు భూములపై వివాదాలు**

తాతముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న పోడు భూములపై హక్కుల కోసం ఆదివాసీలు పోరాడుతున్నారు. జిల్లాలోని పలు ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీశాఖకు, పోడు సాగుదారులకు మధ్య వివాదాలు, కేసులు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. గతంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారికి కూడా భూముల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. నిధుల కొరతతో ఐటీడీఏ గిరిజన సంక్షేమం కోసం ఏర్పాటైన భద్రాచలం ఐటీడీఏకు అరకొర నిధులే అందుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐటీడీఏ ఏర్పడి ఐదు దశాబ్దాలు దాటినా విద్య, వైద్యం, సాగునీరు, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని గిరిజన సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఒకప్పుడు ట్రైకార్ ద్వారా అందిన స్వయం ఉపాధి అవకాశాలు కూడా తగ్గుముఖం పట్టాయని చెబుతున్నారు.

**- పోలవరం పిడుగు.**

పోలవరం ప్రాజెక్టు భద్రాచలం ఏజెన్సీపై తీవ్ర ప్రభావం చూపిందనే ఆందోళన కొనసాగుతోంది. ముంపు కారణంగా అనేక గిరిజన గ్రామాలు తమ ప్రాంతాలను విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చింతూరు, వీఆర్‌పురం, కూనవరం వంటి ప్రాంతాల భవిష్యత్తుపై గిరిజనుల్లో ఆందోళన నెలకొంది. వలసలతో ఆదివాసీల సంప్రదాయాలు, సంస్కృతికి కూడా ముప్పు ఏర్పడుతోందని పలువురు పేర్కొంటున్నారు.

**- అటకెక్కిన ఏజెన్సీ డీఎస్సీ.**

గతంలో గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఏజెన్సీ డీఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారిందనే అభిప్రాయాలు ఉన్నాయి. ఐటీడీఏ పరిధిలోని వైటీసీల ద్వారా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నా అవి యువతకు శాశ్వత ఉపాధి కల్పించే స్థాయిలో లేవనే విమర్శలు ఉన్నాయి.

**- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం.**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాచలంలో ఐటీడీఏ, వివిధ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. మన్యం వీరులకు నివాళులు, భారీ ర్యాలీ, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభావంతులైన గిరిజనులకు సన్మానాలు నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీవో బి.రాల్ గిరిజన భాషలో ప్రసంగించనున్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవోతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొననున్నారు. చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లోనూ ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.





## నైపుణ్యాలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

**ఖమ్మం రూరల్, ఆగష్టు 08 (జనంసాక్షి):**
నైపుణ్యాలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది అని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అన్నారు.శనివారం మండలం లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత విద్యే బలమైన పునాది అని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించాల్సిన బాధ్యతను మరయు కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులు విద్యా ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగించేందుకు మార్గదర్శనం చేయాలనే ఉద్దేశంతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.ముఖ్య అతిథి రిటైర్డ్ ఐ ఏ స్ రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని,పరిశోధనాత్మక దృక్పథంతో సమాజ సేవలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనిఅన్నారు.విద్యార్థులను ఉద్యోగాలకే పరిమితం చేయకుండా పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తే ప్రపంచ స్థాయిలో రాణించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.జయలక్ష్మి, డైరెక్టర్ మల్లంపాటి శ్రీవిద్య, డీన్ డైరెక్టర్ వి సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ మరియు వివిధ విభాగాల అధిపతులు అధ్యాపక మరియు అధ్యాపకే తర సిబ్బంది తల్లితండ్రులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ అనంతరం సేవా స్ఫూర్తి

**అన్నపురెడ్డిపల్లి, ఆగష్టు 8 (జనంసాక్షి)**
పదవీ విరమణ అనంతరం కూడా విద్యాశాఖకు తనవంతు సేవ చేయాలనే సంకల్పంతో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఎం.డి. దీవెనమ్మ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. యర్రగుంట కాంప్లెక్స్ పరిధిలోని ఎంపీయూపీఎస్ భీమునిగూడెం పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహించిన ఆమె 2025 జూన్‌లో పదవీ విరమణ పొందారు. తన ఉద్యోగ సేవలకు గుర్తుగా అన్నపురెడ్డిపల్లి ఎంఆర్సీ (ఎంఈఓ) కార్యాలయానికి సుమారు రూ.15 వేల విలువైన సామగ్రిని విరాళంగా అందజేశారు. ఇందులో ఆరు కుర్చీలతో పాటు సుమారు రూ.10,500 విలువైన వాటర్ ఫిల్టర్‌ను అందించారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా విద్యాశాఖ అవసరాలను గుర్తించి సామగ్రిని అందించడం పట్ల పలువురు ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

**ఎంఆర్సీ కార్యాలయానికి రూ.15 వేల విలువైన సామగ్రి విరాళం**




విద్యారంగా దీవెనమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గొడవ - ఒకరికి గాయాలు

**మేళ్లచెరువు జనంసాక్షి**
మేళ్లచెరువులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిన్న రాత్రి జరిగిన గొడవలో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నైట్ వాచ్‌మెన్ గా విధులు నిర్వర్తిస్తున్న నేర్నకంటి శ్రీను, బుర్రి నాగేశ్వరరావు అనే వ్యక్తి ఆసుపత్రిలో గల పాతబడిన నిరుపయోగ భవంతిలో పడుకోవద్దని చెప్పాడు. దీంతో కక్ష పెంచుకున్న శ్రీను, నాగేశ్వరరావును కొట్టి గాయపరిచాడు.గాయపడిన బుర్రి నాగేశ్వరరావు ప్రస్తుతం ఖమ్మం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.ఈ విషయంపై బాధితుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా నారోజు కుమారస్వామి



మర్రిగూడ, ఆగస్టు 8 (జనం సాక్షి)
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నారోజు కుమారస్వామిని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం శుక్రవారం నియామక ఉత్తర్వులను అధికారికంగా ప్రకటించింది.ఈ సందర్భంగా శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారోజు కుమారస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ కుమార్, నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్‌తో పాటు నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి బీసీల హక్కుల సాధన కోసం పోరాడడంతో పాటు బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు, పార్టీ విస్తరణకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని కుమారస్వామి స్పష్టం చేశారు.
కుమారస్వామి నియామకంపై స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మామిడి పరుశురాం, ఓబీసీ మోర్చా మాజీ మండల అధ్యక్షులు పగిళ్ల లింగస్వామి, బూత్ అధ్యక్షులు ఆమంచల దామోదర్, పంగ యాదయ్య, బీజేపీ నాయకులు పంగ లక్ష్మణ్, పంగ శేఖర్, దండేటి మహేష్, అయితగోని శ్రీరామ్, ఈరగోని శివ తదితరులు పాల్గొన్నారు.

## స్టార్టప్‌ల వైపు ప్రియదర్శిని కళాశాల విద్యార్థినుల అడుగులు

**ఖమ్మం రూరల్, ఆగష్టు 08(జనంసాక్షి ):**
ఖమ్మం రూరల్ మండలం లోని ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ అటానమస్‌లో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) ఆధ్వర్యంలో ఇంట్రా?ఇన్‌స్టిట్యూషనల్ స్టార్టప్ పోటీ శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలు, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కటేపల్లి . నవీన్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా వినూత్న ఆలోచనలతో ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల ఆలోచనలను స్టార్టప్‌లుగా తీర్చిదిద్దేందుకు కళాశాలలో అవసరమైన సాంకేతిక వనరులు, ప్రయోగశాలలు, అధ్యాపకుల మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు తెలిపారు.ముఖ్య అతిథి ంయాఐ ప్రాజెక్ట్ మేనేజర్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్టేట్ హెడ్ బాలు ప్రవర్యక్య మాట్లాడుతూ.. మార్కెట్ అవసరాలను గుర్తించి సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాలని విద్యార్థులకు సూచించారు.పోటీలో వివిధ విభాగాలకు చెందిన సుమారు 30 బృందాలు పాల్గొని జలనేత్ర, స్మార్ట్ క్రాప్ ప్రొటెక్షన్, హార్ట్ అటాక్ డిటెక్షన్, ఎయిర్ అంబులెన్స్, ఫార్మ్ టు హోమ్, కిసాన్‌సాథి ఏఐ, స్మార్ట్ సిటీస్ తదితర ప్రాజెక్టులను ప్రదర్శించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల గోపాల్,అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎన్. జయమ్మ, ఐఐసీ కోఆర్డినేటర్ వి. నాగరాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.





## రైతులకు భారంగా మారిన ఎత్తిపోతల పథకం నిర్వహణ

### ఆలస్యమవుతున్న కొత్త ట్రాన్స్ ఫార్మర్ల మంజూరు

### సొంత డబ్బులతో కొనుగోలుకు రైతుల ప్రయత్నాలు

**పెనుబల్లి, ఆగస్ట్ 8(జనంసాక్షి)**
ఎత్తిపోతల పథకాల నిర్వహణ రైతులకు భారంగా మారుతోంది. చెంతనే గోదావరి జలాలు పారుతున్నా ఎత్తిపోతల పథకాలు పనిచేయక పంట పొలాలు బీళ్లుగా మారడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. రెండు వేల ఎకరాల పంట పొలాలకు గోదావరి, కృష్ణా జలాలను ఎత్తిపోసే రాతోని ఎత్తిపోతల పథకం మూలన పడటం రైతుల పాలిట శాపంగా మారింది. పెనుబల్లి మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల ఐదారు గ్రామాలకు సాగునీరందించే ఈ ఎత్తిపోతల పథకమే వర్షాభావ పరిస్థితులలో రైతులకు అండగా నిలుస్తోంది. ఈ ఎత్తిపోతల పథకాన్ని ఎన్.ఎస్.పీ. ఎడమ కాలువపై ఏర్పాటు చేశారు. ఏడాది వర్షాలు పడక ప్రధాన నీటి వనరైనా పెనుబల్లి రాతోనీ చెరువులోకి నీరు చేరలేదు. ఇటువంటి సమయంలోనే రైతులు ఈ ఎత్తిపోతల పథకంపై ఆధారపడతారు.వేసవి కాలంలో అపహరణకు గురైన రెండు ట్రాన్స్ ఫార్మర్లను సకాలంలో పునరుద్ధరించుకోక పోవడం వల్ల ప్రస్తుతం రైతులు ఆ నష్టాన్ని చవి చూడాల్సి వస్తుంది. ఐ డీ సీ అధికారులు కొత్త ట్రాన్స్ ఫార్మర్లు కోసం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. దాదాపు పది లక్షల రూపాయలకు పైగానే వ్యయమవుతోంది.ఖరీఫ్ పంట కాలం ప్రారంభమై నెలలు కావస్తోంది. వారం రోజుల క్రితం పథకం నిర్వహణ కమిటీ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశానికి రైతుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ప్రభుత్వం నుంచి కొత్త ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది కాబట్టి, ఈ పంట సీజన్లో నష్టపోకుండా ఉండాలంటే రైతులే సొంతంగా నిధులు సేకరించి ట్రాన్స్ ఫార్మర్లు కొనుగోలు చేయాలని ఎక్కువ మంది రైతులు అభిప్రాయపడ్డారు. కొత్త ట్రాన్స్ ఫార్మర్లు కొనుగోలుకు డబ్బులు వసూలు చేయాలంటే రైతులకు - పథకం నిర్వహణ కమిటీకి మధ్య సమన్వయం ఉండాలి. కమిటీ పనితీరు పారదర్శకంగా ఉండాలి. పథకం నిర్వహణకయ్యే ఖర్చులు కోసం వసూళ్లు చేసే డబ్బుల జమా ఖర్చులు పట్ల రైతులకు అనుమానాలు లేకుండా చూసుకోవాలి. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి. అన్ని ప్రాంతాల ఆయకట్టు రైతులు కమిటీలో ఉండే విధంగా చూసుకోవాలి. కమిటీలో సభ్యులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. అప్పుడు మాత్రమే ఎటువంటి ఆటంకాలు లేకుండా ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్వహించుకోగలుగుతారు.







## ఆదివాసీ ఉత్సవ నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

- విఐపి లకు గిరిజన ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలి
- ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్

**భద్రాచలం ఆగస్టు 08 (జనంసాక్షి)**

భద్రాచలంలో ఆదివారం జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని, కార్యక్రమంకు హాజరయ్యే వీఐపీలకు, గిరిజనులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలో ఆదివాసీ దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అంబేద్కర్ సెంటర్, పాత మార్కెట్ సెంటర్ దగ్గర ఉన్న మహనీయుల విగ్రహాల వద్ద జరిగే కార్యక్రమాలు, బ్రిడ్జి సెంటర్ వరకు నిర్వహించే ర్యాలీ సమయంలో గిరిజన భవనంలో జరిగే కార్యక్రమం వరకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. గిరిజన భవనంలో నిర్వహించే ఆదివాసి సాంప్రదాయ ప్రకారము జరిగే పూజా కార్యక్రమాలు, ప్రముఖుల ప్రసంగాలు, వివిధ పాఠశాలల బాలబాలికల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలు అయిపోయే వరకు పకడ్బందీ చర్యలు తీసుకునేలా అధికారులను నియమించడం జరిగిందని, జిల్లా అధికారులకు సంబంధించిన వాహనాలను పార్కింగ్ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, టీఏ శ్రీనివాస్, ఏటీడీవో రాధమ్మ, డీఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

## క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని చాటిన త్రివేణి విద్యార్థులు

**ఖమ్మం, ఆగస్టు 8, (జనంసాక్షి) :**

క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్మరించుకుంటూ త్రివేణి టాలెంట్ స్కూల్స్, ఖమ్మం శాఖలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీజీ ఇచ్చిన "భారత్ విడిచి వెళ్లండి" పిలుపు స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల ఐక్యత, త్యాగానికి ప్రతీకగా నిలిచిందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు జాతీయ పతాకాలతో దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, నినాదాలతో స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశభక్తి, ఐక్యత, బాధ్యతాయుత పౌరసత్వం వంటి విలువలను అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. డైరెక్టర్ డా. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు పరిచయం చేయడం విద్యాసంస్థల బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ శ్రీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులు క్రమశిక్షణ, ఐక్యత, దేశసేవ ద్వారా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## జైల్ బరో కార్యక్రమానికి జయప్రదం చేయండి

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారికి వినతిపత్రం అందించిన

### ఆశా వర్కర్లు - సిఐటియు యూనియన్ జిల్లా నాయకురాలు పి.రమ్య

### మండల కన్వీనర్ బాదావత్ శ్రీను నాయక్ కార్యకర్తలకు పిలుపు

**కామేపల్లి,ఆగస్టు 8 (జనంసాక్షి):**



మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శాఖ అధికారికి వినతి పత్రం అందిస్తూ సీఐటీయూ యూనియన్ మండల కన్వీనర్ బాధావత్ శీను నాయక్ ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ కామేపల్లి మండలం ఏజెన్సీ పరిసర ప్రాంతమైన 24 గ్రామపంచాయతీలలో పనిచేస్తున్నటువంటి ఆశా వర్కర్లు కామేపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్య అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈనె10వ తేదీన జరగబోయే జైల్ బరో కార్యక్రమంలో మేము సైతం అంటూ అందరం కలిసిమెలిసి మా సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లి పరిష్కరించుకునేందుకు.అందరూ భాగస్వామ్యం ఆఐ పాల్గొంటున్నామని ముందస్తు వారు వైద్య అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకురాలు పి రమ్య మండల సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కోర్ర నీల.రేఖ. ఏ విజయ. ఘమ్మి.రాంబాయి అనిత.విజయ. కమలమ్మ.పద్మ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ కు రూ.5 లక్షల విలువైన వ్యాధి నిర్ధారణ పరికరాలు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు

**భద్రాచలం ఆగస్టు 08 (జనంసాక్షి)**



తలసేమియా, సికిల్సెల్ ఎనిమియా రక్తహీనత వ్యాధిని అరికట్టేందుకు రూ.5 లక్షలు విలువ చేసే వివిధ రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను అందజేసేందుకు భద్రాచలం ఐటీసీ పేపర్‌బోర్డ్ ఉన్నతాధికారులు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటరు డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు తెలిపారు. ఈ మేరకు శనివారం భద్రాచలం ఐటిసి ఎస్పీడీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ వ్యాధి నిర్ధారణ పరికరములను అందజేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే అందజేస్తామని పేర్కొన్నారు. 2026-27 సంవత్సరమునకు రూ. 5లక్షల వ్యయంతో, 1800 వ్యాధి నిర్ధారణ పరికరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ డాఎస్. ఎల్.కాంతారావు, పాకాల దుర్గా ప్రసాద్, జి.రాజారెడ్డి, వై. సూర్యనారాయణ, బి. వెంకటరెడ్డి, వి.కామేశ్వరరావు, సిద్దారెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త లింగాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవ ఎన్నిక

### అధ్యక్షులుగా పగిడిపల్లి కాటయ్య , ఉపాధ్యక్షులుగా ఎరుకల రమేష్

**కామేపల్లి,ఆగస్టు 8 (జనంసాక్షి):**



కామేపల్లి మండల పరిధిలోని కొత్త లింగాల గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు కార్యదర్శులు ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది వారితోపాటు కార్యవర్గాన్ని అనుబంధ సంఘాల నాయకులను నియమించారు. కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు ఆదేశానుసారం. కొత్త లింగాల గ్రామములో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖను పార్టీ కార్యకర్తల సమావేశపరిచి అట్టి సమావేశంలో ఏకగ్రీవంగా గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పగిడిపల్లి కాటయ్య ఉపాధ్యక్షులుగా ఎరకల రమేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయల పెద్ద వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శిగా యడ్లపల్లి శేషగిరిరావు కార్యదర్శిగా బైరెడ్డి యుగంధర్ రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీ గుండ్ల సుధాకర్ శాఖను ఏర్పాటు చేసుకోవడం జరిగినది కార్యవర్గ సభ్యులు తడిక మల్ల శ్రీను. గొడవర్తి శంకర్. చెరుకుమల్ల శ్రీను. అడపు శంకర్. నారాటి రోశయ్య. పండగ శ్రీను. అల్లం రాజేష్. రెంటాల వెంకన్న.ఎన్నుకోవడం జరిగినది నూతనంగా గ్రామ శాఖ కు ఎన్నికైన సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు.జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్.డి సి సి బి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ జిల్లా నాయకులు తోటకూరి శివయ్య ఓబీసీ జిల్లా అధ్యక్షులు పిఏసిఎస్ కామేపల్లి అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం. కొండాయిగూడెం పి ఎస్ సి ఎస్ అధ్యక్షుడు దనియాక హనుమంతరావు. ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబురు నాయక్ మాజీ జెడ్పిటిసి సరిరామ్ నాయక్ తదితరులు పాల్గొని ఎన్నికైన వారిని అభినందించారు.

## గోదావరి వంతెన కింద గుర్తుతెలియని మృతదేహం

**బూర్గంపహాడ్ ఆగస్టు 08 (జనంసాక్షి)**



భద్రాద్ర కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక?భద్రాచలం గోదావరి వంతెన కింద శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. వంతెన మూడో పిల్లర్ వద్ద మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గజ ఈతగాడు ప్రసాద్ సహాయంతో మృతదేహాన్ని గోదావరి నుంచి వెలికితీయించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుడు బూడిద రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు లేదా ఆచూకీ తెలిసిన వారు 8712682055, 8712682057 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై మేడా ప్రసాద్ కోరారు.

## శ్రీచైతన్య లో ఘనంగా బోనాల వేడుకలు

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 8 (జగంసాక్షి)**



ఖమ్మం మామిళ్లగూడెం లోని శ్రీచైతన్య టెక్నో స్కూల్లో బోనాల పండుగను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు పాల్గొని, తెలంగాణ సంస్కృతి మరియు సంప్రదాయాలను ప్రతిబింబించేలా బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బోనాల పండుగ విశిష్టతను వివరిస్తూ, మన సంస్కృతి?సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ , డైరెక్టర్ శ్రీవిద్య , ఏజీఎం చేతన్ , ప్రిన్సిపల్ నీరజ , ప్రీ-ప్రైమరీ కోఆర్డినేటర్ గౌతమి , ప్రైమరీ ఇన్‌చార్జ్ కళ్యాణి , ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ గీత , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బోనకల్ లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత... సర్పంచ్ బానోతు జ్యోతి కొండ



**బోనకల్, ఆగస్టు 08 ( జనంసాక్షి):** బోనకల్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సర్పంచ్ బానోతు జ్యోతి ,ఉపసర్పంచ్ కొండ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి పర్యవేక్షణలో గ్రామపంచాయతీ సిబ్బంది గత కొన్ని రోజులుగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేస్తున్నారు. తాజాగా వర్షా కాలం సీజన్ ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా గ్రామంలో బ్లీచింగ్ చల్లడం, దోమల మందు పిచికారి చేయడం ,మురికి కాలువలు శుభ్రం చేయడం, మురుగు నీటిలో వాటర్ బాల్స్ వేయడం లాంటి పనులు ముమ్మరం గా చేస్తున్నారు. ప్రభుత్వ విద్యాలయాలు ,గురుకుల పాఠశాలలు, మొదలగు ఎక్కువ జనావాస ప్రాంతా లలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేకం గా పేట్రియం ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ వారు మాట్లాడుతూ ఇంటిలోపల, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని అన్నారు. పగటిపూట మాత్రమే కుట్టే ఎడిస్ ఈజిప్ట్ దోమ వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని, ఈ దోమ మంచినీటి నిల్వల్లో వృద్ధిచెందుతుందని అన్నారు. పాత టైర్లు, మురుగు కాల్వలు, కొబ్బరిచిప్పలు, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు, బకెట్లు, బిందెల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచడం వల్ల అందులో లార్వా పెరిగి దోమ లు వ్యాప్తి చెందుతాయన్నారు. వర్షాలు పడుతున్నం దున దోమలు పెరిగి, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దోమల నియంత్రణతో వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టవచ్చని అన్నారు. వర్షాకాలం కావడంతో దోమల వృద్ధితో డెంగీ, మలేరియాకి గురవుతారని అన్నారు. టైర్ షాపులు, పాత ఇనుప సామానుల షాపులు, ఆటోమొబైల్, పంక్చర్, కూల్ డ్రింక్స్ తదితర షాపుల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని, పరిశుభ్రత పాటించాలని అన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడడం, ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామంలో తిరుగుతూ మొక్కల కుండీలు, కూలర్లలో, ఉపయోగంలో లేని వస్తువులలో నీటి నిల్వలను తొలగించి, తేమోపాస్ ద్రావణం పిచికారీ చేయించారు. పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి కోల రాజేశ్వరి తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫినాయిల్, మలాథీన్లతో స్ప్రే తో పాటుగా ఫాగింగ్ చేయడం జరుగుతుందన్నారు. పరిశుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తెరిగి నడవాలన్నారు. అదేవిధంగా సిబ్బందితో టీములను ఏర్పాటు చేసి పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# బోనకల్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్

- వైరా ఏసీపీ సారంగపాణి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**బోనకల్ , ఆగస్టు 08 ( జనం సాక్షి) :** మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తూ, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులను గుర్తించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల అమలు, వాహనదారుల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించడమే స్పెషల్ డ్రైవ్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.
ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.
బోనకల్ మండల కేంద్రంలో పోలీసులు పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడంతో వాహనదారులు అప్రమత్తమయ్యారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఇకపై కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగిస్తామని పోలీసు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఏసీపీ సారంగపాణి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొంగర మధు, బోనకల్ సబ్ ఇన్‌స్పెక్టర్ మాచినేని రవి, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# జానంపేటలో ఇసుక లారీ, బైక్ ఢీ? ముగ్గురికి గాయాలు

**పినపాక, ఆగస్టు 08(జనం సాక్షి):** పినపాక మండలం జానంపేటలో ఇసుక లారీ, బైక్ ఢీ కొన్నట్టు సమాచారం. జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఈ ప్రమాదంలో గాయపడగా, గాయపడిన వారిని 108ద్వారా ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డవారు గడ్డిగూడెం గ్రామానికి చెందిన కొరస నర్సింహారావు, జానంపేట పీహెచ్‌సీలో నర్స్‌గా పనిచేస్తున్న కొరస హిమవతి, గడ్డిగూడెం గ్రామానికి చెందిన మద్దెల రాణి గా స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులకు సహాయం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, కారణాలు తెలియాల్సి ఉంది.

### పినపాక ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి

# జాతీయ స్థాయి క్రికెట్ ఉపకార వేతనం



**పినపాక, ఆగస్టు 08 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె. ప్రతీక చౌదరి అరుదైన ఘనత సాధించింది. హిమాలయ వెల్‌నెస్ సంస్థ నిర్వహించిన “వన్‌డర్ ఉమెన్ ఉపకార వేతనం ? 2026” కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఎంపికైన 100 మంది విజేతల్లో ప్రతీక చౌదరి చోటు దక్కించుకుంది. క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న బాలికలను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా క్రికెట్ శిక్షణ, కోచింగ్ తదితర అవసరాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ప్రతీక చౌదరికి రూ.38 వేల ఉపకార వేతనం లభించడం పట్ల పాఠశాల హెడ్మాస్టర్ రామిరెడ్డి, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# ఆదివాసీ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

## బండారి రవికుమార్



**పినపాక, ఆగస్టు 8 (జనం సాక్షి):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పినపాక మండలం ఇబయ్యారం క్రాస్‌రోడ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆదివాసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి రవికుమార్ మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉప్పాక బ్రిడ్జి నుంచి ఇబయ్యారం క్రాస్‌రోడ్ వరకు ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన ఆదివాసీలు కొమ్ము వాయిద్యాలతో ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఇబయ్యారం క్రాస్‌రోడ్‌లోని కొమురం భీమ్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. జల్?జంగల్?జమీన్ హక్కుల కోసం పోరాడిన అమరవీరుల ఆశయాలను సాధించాలని రవికుమార్ అన్నారు. భూమి, అటవీ హక్కులతో పాటు విద్య, వైద్యం, ఉపాధి, రహదారులు, తాగునీరు, సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆదివాసీ యువత విద్యతో పాటు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కొమురం భీమ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుబ్బ గోవర్ధన్, జిల్లా నాయకులు మడివి రమేష్, కంతారావు, సర్పంచ్ బాపనమ్మతో పాటు ఆదివాసీ సంఘాల నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**ఖమ్మం కార్పొరేషన్ ఆగస్టు 8 (జనంసాక్షి)**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా జరుగు జైల్ బరో కార్యక్రమంలో కార్మికుల అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టి యు సి ఐ ఖమ్మం ఏరియా కార్యదర్శి కే శ్రీనివాస్ కార్మిక వర్గానికి పిలిపివేయడం జరిగింది. ఈరోజు స్థానిక రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో బొమ్మకంటి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ 44 లేబర్ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ ను తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసరిగా చేస్తున్నటువంటి మోడీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ వ్యతిరేకంగా నాలుగు రైతు నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతులకు ఉరితాలుగా తయారైన ఈ చట్టాలను తక్షణ రద్దు చేయాలని స్వామినాథం కమిషన్ సిఫారసులు అమలు చేయాలని తదితర డిమాండ్స్ తో జులై 10న జరుగు జైలు బోరో కార్యక్రమంలో రైతులు కూలీలు కార్మికులు శ్రామికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.. ఈ సమావేశంలో టియుసిఐ ఖమ్మం నగర నాయకులు శోభను దాసు సైదులు పాక లింగయ్య ప్రసాదు తిరుపయ్య వెంకన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




### ఇల్లందు నుంచి వచ్చేఆర్టీసీ బస్సును
## ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
### ఇల్లందు డిపో మేనేజర్ సుభాషిని

**ఆళ్లపల్లి ఆగస్టు 8(జనంసాక్షి)**
గత 20 రోజుల క్రితం మర్కోడు గ్రామపంచాయతీ సర్పంచ్ సుతారి రమాదేవి,ఉప సర్పంచ్వగలబోయిన సతీష్ ఇల్లందు డిపో నుండి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఇల్లందు డిపో మేనేజర్ సుభాషి ని కలసి వినతి పత్రం ఇవ్వడం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఇల్లందు డిఎం సుభాషిని ఆక్సిడెంట్ మేనేజర్ సునీత మాట్లాడుతూ ఇల్లందు నుండి మర్కోడు వరకు రహదారిని పరిశీలించామని తెలిపారు. ఇంతకుముందు ఇల్లందు డిపో నుండి మర్కోడ్ వరకు ఆర్టీసీ బస్సు వేయడం జరిగిందని ఆళ్లపల్లి మర్కోడు మండల ప్రజ లు దానిని సద్వినియోగం చేసుకోలేదని తెలిపారు మళ్లీ ఆర్టీసీ బస్సు ని తిరిగి పంపించడం జరుగుతుందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఆర్టీసీ బస్సు ని ఎక్కి ఆర్టీసీ బస్సుకి కొండంత అండగా ఉండాలని తెలిపారు ఒకవేళ మండల ప్రజలు ఆర్టీసీ బస్సు ని సద్వినియోగం చేసుకొని ఎడల బస్సు నీ పూర్తిగా రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో కాసబోయిన. వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి,తాళ్లపల్లి యుగంధర్, కోతి యాదగిరి, గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





## గీతన్నల చైతన్య యాత్రకు ఘన స్వాగతం

**చౌటుప్పల్ ఆగస్టు 8(జనంసాక్షి)**
గీత కార్మికుల సమస్యలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న గీతన్నల చైతన్య యాత్ర దండు మల్కాపూర్ గ్రామంలోని శ్రీ ఆందోల్ మైసమ్మ దేవస్థానం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న నాయకులు, గీత కార్మికులకు గ్రామ సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గీత కార్మికుల ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్,గౌడ సంఘం నాయకులు, గీత కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.అలాగే మల్కాపూర్ గౌడ సంఘం అధ్యక్షులు కలగోని శ్రీధర్ గౌడ్, గౌడ సంఘం ఉపాధ్యక్షులు, వార్డు సభ్యులు పొట్లపల్లి శివశంకర్ గౌడ్, కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షులు బుర్ర స్వామి గౌడ్, ఉపాధ్యక్షులు కిషన్, వార్డు సభ్యులు సుంకరి విజయ్‌కుమార్ గౌడ్ తో పాటు గౌడ సంఘం సభ్యులు, గీత కార్మికులు పాల్గొన్నారు.గీత కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న చైతన్య యాత్రకు గౌడ సంఘాలు, గీత కార్మికులు మద్దతు తెలిపారు.




### ఎస్వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో
## విద్యార్థి సంఘం ఎన్నికలు

**ఖమ్మం, (జనంసాక్షి) :**
విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య వ్యవస్థ పై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా నగరంలోని స్థానిక శ్రీనివాస్ నగర్ లో గల ఎస్వీఎం సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియను చాలా ఉత్సాహవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియను నిజమైన ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటర్ల జాబితా, నామినేషన్ల ప్రక్రియ, వేలిపై సిరా గుర్తు, సీక్రెట్ బ్యాలెట్ లేదా ఈ- ఓటింగ్ పద్ధతిలో నిర్వహించడం విశేషం. విద్యార్థులందరూ క్రమశిక్షణతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పిడియాట్రీషియన్ డాక్టర్ సురేష్ బాబు, ప్రముఖ సైకియాట్రిస్టు డాక్టర్ సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నాయకత్వ ప్రతిభ, బాధ్యతాయుత ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలు నేర్పించడానికి ఎన్నికలు చాలా ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కిషోర్ బాబు, స్కూల్ డైరెక్టర్లు ఉమా, శ్రీధర్ రావులు మాట్లాడుతూ విద్యార్థుల్లో గెలుపోటములు కంటే ఎన్నికల్లో భాగస్వాములు కావడం, ప్రజాస్వామ్య ప్రక్రియను తెలుసుకోవడం కోసం విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం కోసం ఈ నమూనా ఎన్నికలు నిర్వహించామని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పివిఆర్ మురళీమోహన్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




## పాల్వంచ అస్థిత్వాన్ని కాపాడుకుంటాం: సీపీఐ

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 9 (జనం సాక్షి):**
పాల్వంచ ప్రాంత అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు సీపీఐ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు.'బద్లావ్ జరూరి హై' నినాదంతో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు మూడో రోజు పాల్వంచ అర్బన్, రూరల్, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో కొనసాగాయి.పాల్వంచ పట్టణంలో పార్టీ శ్రేణులు భారీ ద్విచక్ర వాహన ప్రదర్శన నిర్వహించాయి.సర్వే నంబర్లు 444, 999, 817, 727, 410లోని స్థలాల సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుందని తెలిపారు.ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో ప్రారంభమైన సర్వేను అధికారులు త్వరగా పూర్తి చేసి అర్హులకు పట్టాలు అందించాలని కోరారు.పాల్వంచ కేటీపీఎస్‌లో 800౹2 మెగావాట్ల నూతన విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.మూసివేసిన స్పాంజ్ ఐరన్ కర్మాగారాన్ని పునఃప్రారంభించి పాల్వంచకు పూర్వ వైభవం తీసుకు రావాలని అన్నారు.పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలను వెంటనే అందించాలని, అటవీహక్కులు, ఉపాధి హామీ చట్టాలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్పొరేటర్లు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# చేపలు పడుతూ.. వరి నాట్లు వేస్తూ నిరసన

### తుంగతుర్తి నుండి సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

**తుంగతుర్తి ఆగస్టు 8 (జనంసాక్షి)**
తుంగతుర్తి వెలుగుపల్లి రోడ్డు అధ్వాన స్థితికి చేరుకోవడంతో శనివారం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు రోడ్డుపై గాలాలతో చేపలు పడుతూ వరి నాట్లు వేస్తూ వినూత్న నిరసన తెలిపారు, ఈ సందర్భంగా బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు తడక మల్ల రవికుమార్ మాట్లాడుతూ అధికారులు ప్రజాప్రతినిధులు వెంటనే తుంగతుర్తి నుండి సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారి రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు,గత బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో జాజిరెడ్డిగూడెం నుండి మానాపురం ఎక్స్ రోడ్డు వరకు 28 కోట్ల రూపాయలతో 2023 నవంబర్లో మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా నూతన రోడ్డు నిర్మాణా పనులకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే మందుల సామేలు కూడా అదే రోడ్డు పనులకు జాజిరెడ్డిగూడెం నుండి మానాపురం వరకు డబల్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పి మళ్లీ ఆయన పేరుతో శిలాఫలకం వేసి శంకుస్థాపన చేసి రెండు సంవత్సరాలు పైగా అయిందని ఇంతవరకు రోడ్డు పనులు పూర్తి చేయలేదని తెలిపారు. రోడ్డు మొత్తం గుంతల మయంగా మారి స్థానిక ప్రజలకు మరియు వాహనదారులకు చాలా ఇబ్బందులు పడుతున్నారని స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్డు మొత్తం అధ్వాన స్థితికి చేరుకొని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, మరోపక్క రోడ్డుకు ఇరువైపులా ఇండ్ల నుండి డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుండి మురికి నీరు రోడ్డుపై పారుతుందని దీంతో వాహనదారుడు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మరియు రోడ్డు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొంకూరి మల్లేష్, బొజ్జ సాయికిరణ్, బొంకూరి మధు, కొండగడుపుల వెంకటేష్, కాసర్ల రాజశేఖర్, తడకమళ్ళ మధు, బొంకూరి సాయి, కొండ మధు, కడియం గోపి, కొండగడుపుల నాగరాజు, గడ్డం నితిన్, పవన్, బద్రి తదితరులు ఉన్నారు.

